కథ

# ముల్లు

విహారి

రెండంచుల కత్తితో యుద్ధమైనా, పిడిలేనిబాకుతో ఆట అయినా-పర్యవసానం?? జవాబులేని ప్రశ్నేంకాదు!

× × ×

కంటిమీద కునుకురావటం లేదు. కళ్లు పత్తికాయలైనాయి. చినుకుగానే మొదలైంది. చిలిపిగానే మొదలైంది. కాగితం విమానం 'హై-ఫైన్! సింప్లీబ్యూటిఫుల్!' సన్నని నవ్వు.

ఆ వారంలోనే-డెస్కులో చిన్నచీటి 'ఐలైక్ యూ సోమచ్' 'హౌమచ్?' 'నాటీ ఇంగ్లీష్'! నవ్వుకుంది. 'మాట్లాడు యార్' వెనుకనుంచీ సన్నగా ఎగశ్వాసలో గిరికీలు కొట్టున్న పలకరింపు.

చూసింది. అప్పటికే కళ్లలో విచ్చిన మందారాలు.

అతను సుధాకర్. ఆ కళ్లలో చికిలింపు. కోపం వచ్చింది. ఏదో చెప్పలేని రోషం. సినిమా కథల్లోలా 'అరుణ' అయింది!

ఒకరోజు-సాయంత్రం దారికాచాడు.

బస్‌స్టాప్‌లో-'మాట్లాడితే ఏమీ మైలపడవు!'

లక్కీగా బస్‌వచ్చింది. ఊపిరి పీల్చుకుంది. వడివడి అడుగులతో పక్కకొచ్చి 'ఐ లవ్ యూ అరూ...రియల్లీ'-చెప్పేశాడు. గుండెదడతోనే ఇంట్లో పడింది.

'ఇది మామూలే లేవే' అన్నారు ఫ్రెండ్స్-వందన, సుమతి.

'పట్టించుకోకు' అన్నది రేఖ. 'అమ్మానాన్నకి చెప్పావా? అడిగింది సుచిత్ర. అందర్నీ విన్నది. చెప్పినట్టే చేసింది. అన్నీ అయినై.

చినుకు కాస్తా జల్లు అయింది.

జల్లుకాస్తా పెద్ద వాన అయింది.

జడుపడ్డది. జ్వరపడింది. మతిలో, గతిలో ఏదో మార్పు మొదలైంది.

నాన్న కాలేజీకి వచ్చారు. దూరంనుంచీ చూపింది. దగ్గర్నుంచీ ఆయనే చూశారు. ప్రిన్సిపల్ రూమ్‌లో పెద్ద కౌన్సిలింగ్ జరిగింది(ట)!

నాలుగు రోజులు కాలేజీకి ఎగ్గొట్టింది.

సోమవారం వెళ్లింది. ఆ వేళల్లా కొరకొరా చూస్తూనే వున్నాడు. కారిడార్ టాక్సకేం తక్కువలేదు.

సాయంత్రం బస్‌స్టాప్ వరకూ వెంబడించాడు. రేఖవుంది. చుట్టుపక్కల చాలా మంది స్టూడెంట్స్. జనం పల్చగా వున్నారు. రూట్ బస్ వచ్చింది. రేఖ వెళ్లిపోయింది.

ముఖాముఖీ మాటలదాడి. "ఈ కంప్లెయింట్సూ, బెదిరింపులూ, లెసన్స్ పీకించటం నీకే మంచిది కాదు. నీ రోగం ఎట్టా కుదర్చాలో నాకు బాగా తెలుసు"

గ్రుడ్లురిమాడు. పిడికిలి చూపాడు. ముప్పై వంకర్లు తిరుగుతూ బైక్‌మీద రయ్యిన వెళ్లిపోయాడు. 'ఐలవ్‌యూ చెప్పకపోతే ఐపోతావ్ జాగ్రత్త' మాటలు గాలిలో తేలుతూ వచ్చి చెవుల్ని తాకినై. బైక్ వెనకవాడు తనవైపు చూస్తూ చేతులు తిప్పుతున్నాడు.

గుండెల్లో దడ, కాళ్లు వణికినై, కళ్లల్లో చెమ్మ.

బస్ రాలేదు. చాలా సమయమైంది. బుర్రవేడెక్కింది. శరీరం నీరసపడింది. ఆటో వచ్చింది. ఎక్కేసింది.

రాత్రంతా మాటలే మాటలు. మధ్య మధ్యలో లాంగ్ బ్రేక్స్‌లా-మౌనమే మౌనం. జాగారం చేశారు అమ్మానాన్నా తనూ!

నాన్న వెళ్లి వాళ్ల ఇంట్లో పంచాయితీ పెట్టారు. హామీ తీసుకున్నారు. 'అతనుమాత్రం ముంగిలా కూర్చున్నాడు. పల్లెత్తు మాటలేదు. కన్నింగ్‌ఫాక్స్' అన్నారు నాన్న.

సెప్టెంబర్ ఐదు టీచర్స్‌డే! మీటింగ్!

చాలా యాక్టివయ్యాడు. కలెక్షన్స్. ఉన్నట్టుండి లీడరైపోయాడు. వందరూపాయలు అడిగి తీసుకున్నాడు. లిస్ట్‌లో పేరు రాస్తుంటే 'యువర్ హేండ్ ఈజ్ బ్యూటిఫుల్' అన్నాడు-శ్లేషవేత్తలా! 'ఈ వందసరే. నా ఫైవ్ కూడా నాకివ్వరాదూ?' అన్నాడు. కళ్లు చికిలించాడు. అర్థం కాలేదు ఆ తర్వాత రేఖ చెప్పింది. పేర్లతో కలిపి 'ఐలవ్ యూ' ట కొత్త జబ్బు!

నోటుతీసుకొని వేలు గిల్లాడు. కొంటెనవ్వు. చూపుల్లో అగ్గిపూలు రాల్చింది. ఏమీ జరగనట్టు వెళ్లిపోయాడు. ఆ రోజు వగలంతా బైక్‌మీద తిరుగుతూనే వున్నాడు.

సాయంత్రం పార్టీ, ఉపన్యాసాలూ అయ్యేసరికీ చాలా లేటయింది.

-కాలనీలో బస్ దిగి రోడ్ వెంటనడుస్తోంది. పెద్దగా వెలుగు లేదు. పార్క్ పక్కగా మసక చీకటి. బైక్ పట్టుకొని నిలబడి వున్నాడు. దారికి అడ్డమొచ్చాడు. 'మాట్లాడాలి..ఆగు...'

ఆగలేదు.

కాళ్లముందుకి బైక్. ఉలిక్కిపడింది. చెప్పలేని లోబెరుకు.

మీది మీదికి వచ్చాడు. "చెప్తుంటే ఆగవేం? ఉండు" గద్దించాడు.

కాళ్లు అసంకల్పంగా నిలబడినై. "నువ్వెన్ని పంచాయితీలు పెట్టించినా నిన్నొదలను. ప్లీజ్ అరూ. నా మాట విను..."

తలెత్తి చురుగ్గా చూసింది. 'వినను....'

"ఐలవ్ యూ రియల్లీ. పెళ్లి చేసుకుందాం..."

పేలవంగా నవ్వింది. ఒక చేత్తో బైకుని పట్టుకునే, రెండో చేత్తో తన చేతిని లాగాడు. విదిలించుకుంది. తత్తర పడింది. ఒక్క ఉదుటున కదిలింది. నడక సాగించింది.

"ఓ..కే..ఐల్..సీ...ఐల్..సీ..." అంటూ వెనక్కిపోయాడు.

-'పెళ్లి!' వెటకారంగా నవ్వుకుంది.

అమ్మకి చెప్పింది. అమ్మ నాన్నకి చెప్పింది. మామూలు కథనమే. ఇదంతా తమకే జరగాలా-అని ముగ్గురూ కలిసి పడేవేదన. అంతమంది వుండగా తనవెంట పడిందేం పీడ అని తన ఆక్రోశం, క్రోధం, రోషం, బాధ, ఏడుపు....?!

ఉన్నట్టుండి ఒక ఆదివారం సాయంత్రం-

అతని అమ్మానాన్నా తమ ఇంట్లో దిగారు. తోడుగా ఇంకో ఇద్దరు (పెద్ద) మనుషులు!

నాన్న తన ఫ్రెండ్స్‌ని ఫోన్‌మీద రప్పించారు.

ఎడతెగని మాటలు. సర్కిల్‌లో గిరికీలు. 'పెళ్లిచేస్తాం కదా, మీకేమిటి అభ్యంతరం?'-ఒకటే ప్రశ్న. 'మావాడు మీ పిల్లని నిజంగా ప్రేమిస్తున్నాడు'-ఒకటే సమాధానం.

తనకు తిక్కరేగింది. కోపమొచ్చేసింది. "అరవైమంది క్లాసులో యాభై పైమాటే అతని ర్యాంక్. చదివేది సెకండియర్. రూపాయి పాకెట్ మనీ లేకుండా ఒకరోజు కాలేజీకి పంపండి. తెలుస్తుంది. బతుకా, పరాచికాలా? అయినా మీకు నచ్చితే చాలా? మా నిర్ణయం చెప్తా వినండి. నేను.. మీ.. అబ్బాయిని.. పెళ్లి చేసుకోను...సరేనా?" "పెళ్లి అనే పదమే ఎబ్బెట్టుగా వుంది వినటానికి. ఏంపెద్దవాళ్లో ఏమో...?" ఉదాత్త అనుదాత్త స్వరాలు బాగానే అర్థం చెప్పాయి.

పొల్లుమాటలూ, సొల్లు కబుర్లూ సాగి సాగి, ఆగినై. వెళ్లిపోయారు.

మర్నాడే,

లంచ్‌టైమ్‌లో తమ ఫ్రెండ్స్ అందరి మధ్యలోకే వచ్చి పెద్దగొంతుతో "నిన్నటితో బతికిపోయాననుకోకు. చెప్తా నీపని..." అని పళ్లు కొరికి పోయాడు.

అందరూ విస్తుపోయారు.

ప్రిన్సిపాల్ దగ్గర పెద్ద రచ్చ. పోలీస్ కంప్లయింట్ ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించి పంపించేశాడాయన.

ఒక వారం గడిచింది.

ఆదివారం-అష్టలక్ష్మి టెంపుల్ ఆవరణ,

పిల్లర్ పక్కగా-'మీ వెనకాలే వచ్చాను' పల్లికిలించాడు.

ఉలిక్కిపడి పక్కకి జరిగి తేరిపారా చూసింది.

'కొత్తబ్లేడ్ జేబులో పెట్టుకు తిరుగుతున్నాను. దానికి పనిపెట్టకు. చాలా ఓపిక పడుతున్నాను'... పక్కగా అమ్మానాన్నల కంటపడకుండా మాయమైనాడు.

గుండెల్లో భయం రేగింది. అమ్మానాన్న ఈ మూర్ఖుణ్ణి ఎలా వదిలించుకోవాలా అనిచాలా ఆలోచన చేశారు. నిద్రలేని రాత్రులు భారంగా గడుస్తున్నై.

ఓ సాయంత్రం నాన్న నవ్వుకుంటూ ఇంటికొచ్చారు. విజయవాడ ట్రాన్స్‌ఫర్! సమస్య తీరిపోయిందనే రిలీఫ్! షిఫ్టింగ్ అయిపోయింది.

పరిసరాలు, పరిస్థితులు, వాతావరణం-అన్నిటా మార్పు. కొత్తకాలేజీ, కొత్త ఫ్రెండ్స్. చదువు సీరియస్‌గా సాగుతోంది.

× × ×

బెంజిసెంటర్ బస్‌స్టాప్! జనమేజనం, ట్రాఫిక్, చాలా రద్దీ సమయం. బస్‌కోసం చూస్తోంది.

బైక్ వచ్చింది! పక్కగా అతనే!

అదిరిపోయింది. "హాయ్" పలకరింపు "హౌ ఆర్ యూ..?" హఠాత్ పరిణామం నుంచి తేరుకొనేలోగానే "తప్పించుకున్నాననుకున్నావ్ కదూ. సప్త సముద్రాలకి ఆవలకెళ్లినా నిన్ను వదలను. మీ ఇల్లూ తెలుసు. నువ్ నా దానివి. దట్సాల్. కమ్ అండ్ ఎంజాయ్. మొండికేసిన కొద్దీ నీకే నష్టం. రా..బేరేజ్ సైడ్‌పోయి మాట్లాడుకుందాం..."



14-11-2009న గుంటూరు అరసం జిల్లాశాఖ ఆధ్వర్యంలో ప్రముఖ అభ్యుదయ సాహితీవేత్త శ్రీ జి. శ్రీకాంత్‌కు పులుపుల వెంకట శివయ్య సాహితీ పురస్కారాన్ని అందిస్తున్న విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ బి. ఈశ్వరరెడ్డి, అరసం రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పెనుగొండ లక్ష్మీనారాయణ, అరసం జిల్లాశాఖ అధ్యక్షురాలు డా॥ కనపర్తి స్వర్ణలతలు

ఏమిటేమిటో మాట్లాడుతూనే ఉన్నాడు. తత్తర పడింది. జనం చూస్తున్నారు. సిగ్గుగా వుంది. కోపంగావుంది. బాధగా వుంది. అసహాయంగా వుంది. కళ్ళు ఎర్రబడినై. పెదవులు అదిరినై. కాళ్ళు తడబడుతున్నై.

ఆటో పక్కగా వచ్చింది. ఎక్కి కూర్చుని 'పోనియ్' అంది హమ్మయ్య అనుకుంది.

ఇంట్లో- కథ మొదటికొచ్చింది.

నాన్న మానసికంగా ఎంతో కుంగిపోయారు. అమ్మ నరేనరి. కళ్ళొత్తుకోవటం, ముక్కు చీదుకోవటం. చదువు వద్దనే వద్దు అనే ప్రాధేయ పూర్వక విలాపం! ఎడతెగని ఆలోచన !

ఆవేళ-

ఉదయం ఏడున్నరే అయింది. కాలేజ్ బస్‌స్టాప్‌లో ప్రత్యక్షమయ్యాడు. అంతగా జనసంచారం లేదు.

"నాకూ నీలాగానే నిద్రాహారాలు లేకుండా పోయినై" మాటకలిపాడు.

కోపమొచ్చింది. తనవాళ్ళు తనకి తెలీదు. "నీది మదపిచ్చి". అనేసింది. విస్తుపోయాడు. తెప్పరిల్లాడు.

"అవును. అందుకనే ఫైనల్‌గా చెప్తున్నాను" అంటూ జేబులోనుంచీ రక్కున కాగితంలో ప్యాక్‌చేసిన బాటిల్ తీశాడు. పక్క పక్కగా దొంగచూపులు చూశాడు. చెప్పాడు.

"ఇదేవిటో తెలుసా. యాసిడ్. మనసు మార్చుకున్నావా సరే. లేకపోతే, నాకు దక్కని అందాన్ని ఇంకొకరకీ, నీకూ లేకుండా చేసేస్తాను. జాగ్రత్త.

రక్కున వెళ్లిపోయాడు.

ఆశ్చర్యపోయింది. ఇంటికి తిరిగి వెళ్లిపోయింది.

ఆలోచన...ఆలోచన...

వర్రిగొడ్డుకు అరుపులు జాస్తి అన్న వద్దతా? లేక తయారు తింటున్నాడా నిజంగానే?

ఇల్లు కుమ్ముపొగలో కూరుకుపోయింది. ఇంట్లోవాళ్ల మనసుల్లో మాత్రం అగ్గి రగుల్తోంది.

ఆ రాత్రి- ఎంతో ఆలోచించింది. ఎన్నెన్నో ఆలోచించింది. అసలు ఇదంతా ఎందుకు జరుగుతోంది. అతనికేం కావాలి? తనుకావాలి అంటే? మేగజైన్స్‌లో చదివింది. సెక్సాలజీ ద్వారా కొంత తెలుసు. టీవీల్లో చూసింది. సినిమాల్లో గమనించింది. మరికొంత తెల్సుకుంది కానీ.

గురిచూసి వేటకత్తి విసిరినట్లు-తనకే ఏమిటీ ఖర్మ? అతని చూపు తన మీదే ఎందుకు పడాలి? చదువుని భ్రష్టు పట్టిస్తున్నాడే? చొక్కా పట్టుకుని ఆ చెంపా ఈ చెంపా వాయించాలనిపించింది. గూబ గుయ్ మనిపించాలనుకుంది. సినిమాలోల్లా కాలికింద నేల పగిలిపోతే బాగుండుననుకుంది. ఏమీ కాలేదు! అదే వికృతపు నవ్వుతో, పిచ్చికోర్కెతో వెంబడిస్తున్నాడు. అసలు గత్యంతరమేమిటి?


పోలీసుల్ని ఆశ్రయిస్తే?

అమ్మకీ నాన్నకీ సుతరామూ ఇష్టంలేదు.

రాత్రి గడుస్తోంది. ఆలోచన ప్రవహిస్తోంది. తన బతుకునే తెల్లవారుస్తాడా? భయం వేసింది. రెండుచేతుల్తో కళ్ళు మూసుకుంది. ఎవరెవరో ఆడపిల్లల వికృతపు మొహాలు కళ్ళముందు కదలాడుతున్నై. మరణ వాంగ్మూలాల కథనాలు గుర్తుకొస్తున్నాయ్. విజయవాడ, వరంగల్, హైదరాబాద్-నగరాల్లో ఘటనలు...ఓహ్. బుర్రతిరిగి పోతోంది! నరాల్లో రక్తం సుడితిరుగుతోంది. వేడెక్కిపోయింది. లేచి, ఫ్యాన్‌స్పీడ్ పెంచుకుంది. చున్నీతో చెమట తుడుచుకుంది. నీళ్ళుతాగింది. బెడ్‌మీద వాలింది. మతిమతిలో లేదు.

ఇప్పుడు-

అరుణలో చాలా మార్పు వచ్చింది. ఉత్సాహంగా వుంటోంది. రేఖతో సబ్జెక్ట్స్ డిస్కస్ చేస్తోంది. కలిసి చదువుతున్నారు.




ఈలోగా సుధాకర్ నుంచీ రెండుమూడు వార్నింగ్స్ వచ్చినై. ఒకసారి రేఖా, వందనా అతనితో తలపడ్డారు. రేఖ చెప్పుతీసి కొట్టబోయింది. జనం మూగారు. పారిపోయాడు. ఆ తర్వాత అతన్ని ఎవరో కొట్టారని తెలిసింది. ఎందుకో తెలీదు. రేఖావాళ్లే ఆ పని చేయించారని అనుకున్నారు తెలిసిన వాళ్ళు.

నరకచతుర్దశి ముందురోజు-

సాయంత్రం-

ఐటిఐ కాంపౌండ్‌వాల్ పక్కగా నడుస్తున్నారు రేఖ, అరుణ. ఏవో కబుర్లాడుకుంటున్నారు. వాళ్లకి ఈ వాక్ అలవాటే!

హఠాత్తుగా ఆగింది బైక్. వెనక నుంచీ దూకాడు సుధాకర్.

రక్కున పక్కకీ, ముందుకీ పరిగెత్తారు. రేఖ, అరుణ. సుధాకర్ అరుణ వైపు వెంబడించాడు. జేబులోనుంచి బాటిల్ తీసి దాన్ని పట్టుకుని దాదాపు అరుణని అందుకున్నంత సమీపంలో యాసిడ్ విదిలించాడు. అప్పటికే అరుణ ముందుకు దూకేసింది. వెనుకనుంచీ ఉన్నపళాన ఎగిరి సుధాకర్ చేతిలోని బాటిల్‌ని ఎగరగొట్టేసింది రేఖ. ఈ అవకాశాన్ని మిస్‌కాలేదు అరుణ. తన బ్యాగ్‌లోనుంచీ పన్నీరు బుడ్డీని పైకితీసింది.

అంతే. క్షణంలో సగంసేపు ఏం జరుగు తోందో ఎవరికీ అర్థం కాలేదు. కళ్లూ మొహమూ చేతుల్లో కప్పుకొని గావు కేకలు పెడుతూ, కుంటుకుంటూ, పడుతూలేస్తూ- బైక్‌వైపు పరుగు తీస్తున్నాడు సుధాకర్.

"దర్టీరోగ్. నీకొక్కడికే చేతవునేరా ఈ విద్య. రాస్కెల్." అంటూ ఉగ్రంగా ఊగిపోతోంది అరుణ. ఆమెకళ్లు చింతనిప్పుల్లా ఉన్నై. పిడికిలి బిగిసే ఉంది. గుండెలు ఎగిరెగిరి పడు తూనే వున్నై. ఊపిరి బుసకొడుతూనే వుంది.

అరుణని పొదివి పట్టుకొని రోడ్ పక్కగా కూర్చోబెట్టింది రేఖ. బైక్ అప్పటికెప్పుడో పారిపోయింది.

క్షణాల తర్వాత అడిగింది రేఖ. "మొహంమీదే పడిందిటే?" అని. "లేదు తప్పించుకున్నాడు. కాళ్లమీద పడివుంటుంది" అంది అరుణ!

కాసేపటికి ఇద్దరూ లేచి నుంచున్నారు. కంగారు తగ్గింది. కాలు కదల్చారు. పక్కన బొరియలోకి జరజరా పాక్కుంటూ పోతోంది నీటిపాము!!